## ఈ వారం కథ




# లక్కీ

డా.కె.వి.ఎన్.డి.ప్రసాద్

వాడి పేరు 'లక్కీ'

ఎవరు పెట్టారోగాని గొప్ప అన్వయ వైచిత్ర్యం ఆ నామవాచకం.

❋ ❋ ❋

అవి నేను పొట్ట చేత్తో పట్టుకుని ఢిల్లీ చేరిన రోజులు. అప్పటికి టీవీలూ లేవు, కంప్యూటర్లు ప్రపంచాన్ని ఒక గ్రామంగా మార్చనూ లేదు. చదవడమూ, సినిమాల్లో చూడ్డమూ తప్ప మహానగరాల గురించి బొత్తిగా తెలియదు. బిక్కుబిక్కుమంటూ ఆకాశ హర్మ్యాలు మెడనొప్పెట్టేదాకా చూస్తూ పరిగెడుతున్నట్టున్న జనాన్ని కాచుకుంటూ ఓ గూడు సంపాదించాను. తెలిసిన మిత్రులు ఉండబట్టి అద్దె ఇళ్ల తాలూకు 'మాఫియా' నుంచి నన్ను రక్షించి ఓ అపార్ట్‌మెంటులో నన్ను ఇరికించారు.

'పెక్కు నీళ్ల మధ్య దొరకని గుక్కెడు నీటి చుక్క'కి మల్లే మానవారణ్యంలో పక్క మనిషివని అనుకునే నాథుడే కరవు. 'ఉద్యోగ రీత్యా తప్పదు లేకుంటే మన గల్లీలే నయంరా నాయనా' అని నా స్నేహితులు వాపోయేవారు.

వండుకోవడానికి ప్రయత్నించాం కాని పనికి వెళ్ళడం, 'వెళ్ళి రావడమనే' హైరానా వంటకి సంబంధించిన ఓపికని, అభిరుచిని అణచివేశాయి. ఓ రోడ్డుపక్క దాబా పట్టుకున్నాం అక్కడ ఉంటే నక్షత్రాల హోటళ్లు లేకపోతే ఇలాటి రోడ్డుపక్కన ప్లాట్‌ఫారం మీద కుర్చీలు, బెంచీలే. మధ్యేమార్గపు హోటళ్లు అరుదు, దూరాలు. కరోల్‌బాగ్‌లో ఉంటాయి కాని అక్కడికి ముప్పై కిలోమీటర్లు. ఉన్నచోటి నుంచి ఆఫీసు దగ్గర మరి. 'ఉద్యోగానికి కొత్త కాబట్టి వేళకి వెళ్ళేందుకు దగ్గర తీసుకున్నావ్, నాలుగు రోజులు పోతే తిండేది దగ్గరో వెతుక్కుంటావు' అని నా స్నేహితులు నవ్వారు.

ఆ హోటల్లోనే పని చేస్తుండేవాడు ఆ కుర్రవాడు. ఎనిమిదేళ్లుంటాయి. నేను వెళ్లినపుడు ఎముకలు కొరికే చలి. అలాగే ఉంటుందనుకున్నా నాకు వేసవి తీవ్రత తరువాత తెలిసి వచ్చింది. మొదట మోకాళ్ల దాకా ఉంటే చిరుగుల స్వెటరూ, పాదాలకు పొంతన లేని చిరిగిన బూట్లూ అదోరకం వాసనతో స్వాతంత్ర్యం తరువాత సంస్థానాలు పోయి పిచ్చి పట్టిన త'రాజు'ల్లా ఉండేవాడు. వేసవిలో ఒంటిపైన చిరుగుల గుడ్డల్ని చొక్కా, లాగూలని అన్వయించుకోవడం మన సృజనాత్మకతని బట్టి ఉండేది. టేబుళ్లు తుడిచేవాడు, కింద తడిగుడ్డ పెట్టేవాడు. ప్లేట్లు, గ్లాసులు తుడిచి పెట్టేవాడు.

అన్నింటికీ ఒక్కటే గుడ్డ...

వీడు వెళ్ళాక మళ్లీ అన్నీ కడుక్కుని పెట్టుకునేవాళ్లం.

'ఒక రకంగా మనం శుభ్రమైన ప్లేట్లలో తింటున్నామని వాడి వల్లే నికరంగా తెలుసు. వీడు లేకపోతే ఆ హామీ లేదు' అని నవ్వేవాడు నాతో ప్రతిసారీ వచ్చే మిత్రుడు.

ఓ రోజు 'ఛోటూ, ఇలారా' అని హిందీలో పిలిచాను. తక్కిన వాళ్ళకి మల్లే కసిరినట్టు ధ్వనించలేదేమో, ఎంత మొహం వాచిపోయి ఉన్నాడో ఏమో ఆప్యాయమైన పలకరింపుకి గబగబా వచ్చాడు. తొర్రి పళ్ళన్నీ కనబడేలా నవ్వుతూ 'ఏం కావాలి సాబ్?' అంటూ. దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు హిందీ నేర్పినా వ్యాకరణాన్ని పరిహసించే వ్యావహారిక భాష ఆ తరువాత అబ్బింది.

ఒకసారి పలకరించిం దగ్గర్నుంచీ వాడు మాకు ప్రత్యేక మర్యాదలు చేస్తుండేవాడు. కుర్చీలు జరిపి కూర్చోబెట్టడం, టేబులూ, ప్లేట్లూ అదే గుడ్డతో మరోసారి తుడవడం, ప్లేటు పెట్టంగానే ప్యాజ్ (ఉల్లిపాయలు) తెచ్చి పోసేవాడు. వాడి దృష్టిలో అది అతి పెద్ద గౌరవం.

మాకు తెలియకుండా ఎన్నిసార్లు కొట్టేవాడో గాని మాతోనే ఎక్కువ సమయం వృథా చేస్తున్నాడని కొట్టడం చూశానో రోజు. వెళ్ళేటప్పుడు మనసొగక వెనుతిరిగి చూస్తే అప్పటి దాకా మాలాటి వాళ్లిచ్చిన చిల్లర నాణెలన్నీ 'సేటు' చేతిలో పోస్తున్నాడు వాడు.

ఆ సేటు అప్పటికింకా ముప్పై ఏళ్ళలోపువాడు. ఆ హోటల్లో ఉన్న పనివాళ్లల్లో ముప్పాతిక మంది పిల్లలే. వాళ్లందరి చేత సేటు పని చేయించుకునే పద్ధతి వెట్టిచాకిరీకి సరికొత్త నిర్వచనంలా ఉండేది. శివకాశిలో అగ్గిపుల్లలు, టపాసులు ఆగ్రాలో తాళాలు పిల్లలే మెరుగ్గా చేస్తారని వాటి యజమానులు చెప్పడం వేరు, రాజధానిలో చివరికి పార్లమెంటు చుట్టుపక్కలా అన్ని రకాల దుకాణాల్లో పిల్లలే ఉండేవాళ్లు. కొసమెరుపేంటంటే నాతో అక్కడికొచ్చే మిత్రుడు పనిచేసేది దీని తాలూకు 'మంత్ర్యా'లయంలోనే చట్టాలెన్నో ఉన్నాయి. అమలు చేయాల్సిన వాళ్లకి నెలసరి మామూలు పడిపోయినంత కాలం వీళ్లకే బాధా లేదు. ఇప్పుడున్న అలాటి పిల్లల్ని స్కూళ్లలో చేర్చడానికో చర్యలకో కొంత మీరు కొంత ప్రభుత్వం చొరవా అరగొరగానైనా ఉన్నాయి. ఆ రోజుల్లో నాస్తి.

❋ ❋ ❋

సంవత్సరం తరువాత పర్యాటక శాఖలో నేను నేర్చి ప్రయోగించిన పైరవీలు ఫలించి ఆంధ్రలోనే ఉద్యోగం చేసే అవకాశం లభించింది.

తిరిగొచ్చే వరకూ లక్కీ పని చేసిన హోటల్లోనే క్షుద్బాధ తీర్చుకున్నది. మేము రావడం కోసం ఆ పనివాడు ఎదురు చూడ్డం, రాంగానే ఉత్సాహంగా సేవలు చేయడం నేను గమనించాను. నా గురించి నాగరీకులమని భావించినా నేనూ ఆ కొద్ది నిమిషాల ఆనందం కోసం స్నేహితులెవరైనా 'ట్రీట్' ఇస్తానన్నా అక్కడికే తీసుకెళ్ళేవాణ్ణి. ఇంత మంది మధ్య ఆ మతి తక్కువ పసివాడొక్కడే నిజంగా పలకరిస్తున్నది. వాడి బతుకు బాగు చేయగలిగే స్తోమత గాని, వాడి నక్కడి నించి బయటకు

మేము రావడం కోసం ఆ పనివాడు ఎదురుచూడ్డం, రాంగానే ఉత్సాహంగా సేవలు చేయడం నేను గమనించాను. నా గురించి నాగరీకులమని భావించినా నేనూ ఆ కొద్ది నిమిషాల ఆనందం కోసం స్నేహితులెవరైనా 'ట్రీట్' ఇస్తానన్నా అక్కడికే తీసుకెళ్ళేవాణ్ణి. ఇంత మంది మధ్య ఆ మతి తక్కువ పసివాడొక్కడే నిజంగా పలకరిస్తున్నది.

తెగలిగే మార్గాలు వనరులు గాని నా శక్తికి మించినవి. నా జీవితం కుదుట పరచుకునేందుకే తిప్పలు పడుతున్నవాణ్ణి.

తిరిగొచ్చేస్తున్న రోజున సేటుతో అన్నాను 'చిన్నపిల్లాడు, పని బాగా చేస్తాడా?' 'చిన్నపిల్లలే సేఫ్ సాబ్, చిన్నప్పట్నించీ మన దగ్గరే ఉంటే ఎక్కడికీ పోరు సార్! మోసం చెయ్యలేరు. పని బాగా చేస్తారు. మన దగ్గరే ఉండేట్టు మనం కంట్రోల్ సాబ్, బుర్ర కూడా తక్కువే' దేశాధినేతలకుండే ముందు చూపుంది వీడికి. దేశం ఎలా ఉన్నా వీళ్ల ఇల్లు చక్కదిద్దుకున్నట్టూ సొంత దుకాణం సంక్షేమం బీమా చేసుకుంటున్నాడు. వోటర్ల విచక్షణ ఎదగకుండా వాళ్లూ, బుర్రలేని వాణ్ణి వాడుకోవడంతో వీడూ పోటీ పడగలరు.

***

దాదాపు పదేళ్లలో మళ్ళీ నేను పని చేసిన ఆఫీసుకే తనిఖీకొచ్చే స్థితికి ఎదిగాను. కొన్ని ఇష్టం ఉన్న, కొన్ని ఇష్టంలేని మార్గాల్లో...

మళ్ళీ ఢిల్లీకి వచ్చాను ఈసారి స్వాగత వసతి, భోజన సౌకర్యాలు అన్నీ అమరి ఉన్నాయి.

ఎన్ని తిప్పలు పడినా నా పాటికి నేను తిరగగలిగిన ఒకప్పటి స్వాతంత్ర్యం గుర్తొచ్చి బాధా, నవ్వు రెండూ వచ్చాయి.

ఏమీ లేని నాటి కలిమి అన్నీ ఉన్నప్పటి బలిమి కన్నా మంచిదనిపించడంతో...

కాకాసురుల్నీ, వందిమాగధుల్నీ తప్పించుకుని నాకిష్టమైన రెస్టారెంటు చేరాను. లక్కీనే టేబుల్ దగ్గరకొచ్చాడు. పొడుగయ్యాడు. అజ్మల్‌ఖాన్ రోడ్డులో వ్యాన్ హుస్సేన్, రేమండ్స్ చవకబారుగా అనిపించే ఫేషనబుల్ దుస్తులు చవగ్గా దొరుకుతాయి. సిటీ తాలూకు ఘుమకం అదే. ఆ డ్రస్సు, బూట్లూ, తలకట్టూ అంతా సిటీ స్టైల్‌లో ఉన్నాయి. ఈ మధ్య ఈ అంతరాలన్నీ తొలగిపోయాయనుకోండి. ముందు గుర్తు పట్టలేదు. గుర్తు పడతాడని నేనూ అనుకోలేదు. చాలా చిన్న వయస్సూ, బుర్ర తక్కువా...

తేరిపార చూశాడు. అయోమయంలోంచి సంభ్రమంలోంచి ఆనందంలోకి ముఖ కవళికలు మారాయి. 'అండా కర్రీ సాబ్!' అప్పట్లో ఆ గుడ్డు కూరే తింటుండే వాళ్లం తరచూ రోటీలతో.

ఆ రెస్టారెంటు మారలేదు. సేటుకు వయసొచ్చింది. నాకు మల్లే బట్టతల వస్తూంది. చేతికి బంగారం బ్రాస్‌లెట్టు - మెడలో చైను లావయింది. పక్క సందులో మారుతీకారు దుమ్ముపట్టింది సేటుదేనని గ్రహించాను.

రెస్టారెంటు అలాగే ఉంది. సేటు ధనవంతుడయ్యాడు. చట్టబద్ధంగానే పన్నులు కట్టి ఉంటే బాల కార్మిక చట్టం వదిలేస్తే... కొత్త బాల ఉద్యోగస్థులు పనిచేస్తూనే ఉన్నారు. 'ఎలా ఉన్నావు లక్కీ?' అన్నాను వాడు తెచ్చిన రోటీ అండాకర్రీ 'ఎగస్ట్రా ప్యాజు' కడుక్కు తింటూ. ఇప్పటికీ భుజం మీద ఒకే గుడ్డ 'నాకేం సాబ్, జల్సాగా ఉన్నా ఇప్పుడు సేటు పనులన్నీ నేనే చూస్తాను సాబ్' కించిత్తు గర్వంగా అన్నాడు. 'నాకు హిసాబ్ తెలీదు కద సాబ్, నా డబ్బులన్నీ సేటే చూసుకుంటాడు, మనకు ఫికర్ లేదు'

నాకు పొల మారింది. నిజమే, ఒక రకంగా అలా ఫికర్ లేకుండా ఉండడమూ అదృష్టమే. 'ఇక్కడే తినేస్తా' సేటుకు అడుగూ బొడుగూ వృధా కావు.

'వారానికో సారి సినిమాకి డబ్బులిస్తాడు సాబ్. నేనెళితే రెస్టారెంటూ ఎలా సాబ్? బైగాడ్ నడవదు సాబ్' వచ్చిన కొద్ది ఇంగ్లీషు ముక్కలూ నేను గుర్తించానా లేదా అని మొహంలో ఉత్కంఠ. 'ఆ డబ్బులూ సేటు దగ్గరే దాచుకుంటా' తెలివి తెల్లారినట్టే ఉంది. శోషణ న్యాయబద్ధంగా అనిపించే కళలో ఆరితేరిన వారు మన దేశంలో చాలా ఎక్కువ.

అందుకే ఎన్ని చట్టాలొచ్చినా ఉన్న పద్ధతులే ఆధునీకరింపబడతాయి తప్ప ఆధునిక పద్ధతులు రావు.

***

తరువాత ఎనిమిదేళ్ళకి మళ్ళీ ఇప్పుడెళ్తున్నాను. తనిఖీ తాలూకు అదనపు ఆనందాలకి నేను ఎదురుచూడను కాబట్టి తప్పించుకుంటూ వచ్చాను, ఈసారి తప్పలేదు.

నా రెస్టారెంటూ నాకు తప్పదు, ఒక్కసారైనా ఢిల్లీ వెళితే. అలాగే ఉంది. కుర్చీలూ, బల్లలూ రిపేర్లు మేకులూ కొట్టించి అలాగే ఉంచాడు, అడిగితే సేటు సెంటిమెంటని కూడా అంటాడేమో.

లక్కీ మరింత దృఢంగా తయారయ్యాడు. డ్రస్సు మాటలూ అన్నీ కాస్త బానే ఉన్నాయి. బుర్ర మాత్రం అలాగే ఉందని మాటల్లో గ్రహించాను.

సేటుకి బట్టతలా, బానపొట్టా వచ్చాయి. పాన్ నములుతూ పక్కన ఊయడానికి గిన్నె కూడా వచ్చింది. పక్కనే ఎవరో రాజస్థానీ అమ్మాయిలా ఉంది. డబ్బు లెక్కెట్టడం, పాన్ అందించడం, పని వాళ్లని అరవడం... జోరుగానే ఉంది. సేటు దాని తొడ మీద చరుస్తూ పరాచికాలాడుతున్నాడు. అండాకర్రీ, రోటీ, ప్యాజ్ వచ్చాక అడిగాను. ఎవరని... విన్నాక మతిపోయింది. అడక్కపోయినా బాగుండేది. 'నా భార్యే సాబ్!' 'కిందటేడు సేట్ పాపం నా కోసం మాట్లాడి చేశాడు సాబ్! ఇక్కడేం ఉంటుందని. సేటు ఇంట్లో పని చూసుకుంటూ అక్కడే ఉండమన్నా. సేటు చాలా మంచివాడు కదా సాబ్!' నిజమే చాలా మంచివాడు. కట్నం కూడా అడిగి ఉంటాడే వీడి కోసం?! 'దహేజు కూడా ఇప్పించాడు సాబ్! ఆ లెక్కలన్నీ తనే చూసుకుంటాడు సాబ్' ఆ లెక్కలన్నిటికీ సంబంధించి మొదట్నించీ చాలా సేవ చేశాడు సేటు...

'ఇప్పుడు నేను హోటలు చూస్తా. నా బీబీ డబ్బు అంతా చూస్తుంది సాబ్! మీ హోటలేరా అంటాడు సాబ్ సేటు 'నేనెంతో లక్కీ కదా సాబ్!' సంబరంగా అన్నాడు. 'పిచ్చి వెధవా!' అన్నాను అప్రయత్నంగా. నా కంటిలోంచి తెలియకుండానే ఓ కన్నీటి బొట్టు జాలువారింది.

ఓ పదిహేనేళ్ళ కుర్రాడొచ్చాడు ఇంతలో - స్కూలయ్యాక ట్యూషన్నుంచి వస్తున్నట్టున్నాడు. బేగ్‌తోసహా, యూనిఫాంలో ఉన్నాడు. సేటు పరాచికాలు ఆపి ఆ కుర్రాడ్ని పక్కనే కూచోబెట్టుకున్నాడు.

'మా సేటు కొడుకు సాబ్. మాకు తరువాత ఓనర్ సాబ్' గర్వంగా అన్నాడు అదృష్టవంతుడు.

బాగుంది చక్రభ్రమణం అప్రతిహతంగా సాగుతోంది. వీడి కొడుకు మళ్ళీ అక్కడే ఉంటాడు. నాలాటి వాడికి అండా కర్రీలు ఇస్తూ. ఆ భార్య గల్లా పెట్టె దగ్గరుండడం ఆమె పరువాలెంత వరకు ఉంటాయన్న దాన్ని బట్టి ఉంటుంది. ఆ తరువాత భర్తకి మరింత సాయపడుతుంది. భారంగా లేచాను. ఇక ముందు ఇక్కడికి రాకపోవచ్చు. నేను రావద్దనే అనుకుంటున్నాను. ఏమన్నా చెప్పినా మొదటి నుంచీ వినే స్థితిలో లేడు వాడు. తెలియని తనం, తెలిసీ తెలియనితనం, తెలిసినా తెలియనితనం, తెలియకపోవడమే ఉత్తమం.

ఫికరు లేని బతుకు

***

ఎవరు పెట్టారో గాని ఆ పేరూ, గొప్ప అన్వయ వైచిత్ర్యం ఆ నామవాచకం...

★

రచయిత చిరునామా:
డా.కె.వి.ఎన్.డి.ప్రసాద్
హెచ్.ఐ.జి-6, సెక్టర్-1
ఎం.వి.పి.కాలనీ,
విశాఖపట్నం - 530 017.

## శ్రుతి మించిన వ్యంగ్యం తెచ్చిన తంటా

'భారత గృహిణి వంటిది గాడిద' అనే జంతువు. నీళ్లు లేకున్నా తిండి లేకున్నా చాకిరీ చేస్తూనే ఉంటుంది. గాడిద బ్రతుకు కాస్త నయమే. గృహిణి తన కష్టాలనెక్కడ ఏకరువు పెట్టినా ఆమెకు పుట్టినిల్లే గతి అవుతున్నది. ఆడదీ, గాడిదా - ఈ రెండూ తమ యజమాని పట్ల అమితమైన విధేయత కలిగి ఉంటాయి' ఈ వాక్యాలు రాజస్థాన్ ఎడ్యుకేషన్ బోర్డు వారు ప్రచురించిన తొమ్మిదో తరగతి హిందీ వాచకంలో ఉన్నాయి. ప్రముఖ హిందీ రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత గోపాల్‌ప్రసాద్ వ్యాస్ గారి రచన ఇది. పురుషుల్ని తిట్టలేక స్త్రీల బతుకుతో గాడిద బతుకులను పోల్చి చేసిన వ్యంగ్య రచన ఇది.

ఈ పాఠ్య భాగాన్ని తొలగించాలంటూ భారతీయ జనతా పార్టీ మహిళా విభాగం ఉద్యమాన్నే చేపట్టింది. రాజస్థాన్ ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ ఎ.ఆర్.ఖాన్ ఈ పాఠ్య భాగంలోని 'సెటైర్'ని బిజెపి మహిళా కార్యకర్తలకు విడమర్చి చెప్పేందుకు సాహసించి విఫలమయ్యారు. ఆ పాఠ్యభాగం తొలగించే ఏర్పాట్లను చూడక తప్పనిసరైంది. గొప్ప రచయిత, జాతీయ అవార్డులను పొందిన మహా మనీషి, చక్కటి వ్యంగ్యాన్నీ, సెటైర్నీ తమ రచనల్లో సున్నితంగా జొప్పించగల దిట్ట అయిన గోపాల్ ప్రసాద్ వ్యాస్ ఇప్పుడు మన మధ్య లేరు. వారు రచించిన ఈ వ్యంగ్యంలోని అంతరార్థాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయకనే ఉద్యమాన్ని లేవదీసి ఆయన అంతరాత్మ క్షోభకు గురయ్యారేమోననిపిస్తున్నది.

ఇనా మన దేశంలో వచ్చే ఉద్యమాల్లో చాలా మటుకు ఇలాంటి అపార్థాలతో కూడినవే అయి ఉంటాయనీ, అవసరమైన అనేక సమస్యల పట్ల అందరూ ఉదాసీనంగానే ఉంటారనీ మనకు తెలియని విషయమా ఏమిటి?

-శ్రేష్ఠా శ్రీరామ్